ప్రజాశక్తి

శుక్రవారం 15 ఆగస్టు 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

జిల్లా అభివృద్ధికి

సమగ్ర ప్రణాళికలేవీ.?

- స్వాతంత్య్రం వచ్చి 79 ఏళ్లు గడిచినా అదే తీరు
- ఇప్పటికీ కలగానే ప్రతిపాదిత ప్రాజెక్టులు



ఒంగోలు పోలీస్ పేరెడ్ గ్రౌండ్స్‌లో స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

స్వాతంత్య్రం వచ్చి 79 ఏళ్లు. జిల్లా అభివృద్ధి చూస్తే ఎక్కడున్నా మన్నదే ఆందోళనగా ఉంది. వెనుకబడిన జిల్లాలను వేరుచేసి ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేసి కూడా 54 ఏళ్లు గడిచింది. ఇప్పటికీ ఆశించిన ప్రగతి లేదు. ఏటా స్వాతంత్య్ర దినోత్సవం నాడు అభివృద్ధి చేస్తామని మంత్రి ఉపన్యాసం ఘనంగా ఉంటుంది. అధికార యంత్రాంగం తయారు చేసిన సంక్షేమ పథకాల నివేదికలను చదివి వినిపించడం తంతుగా మారింది. అభివృద్ధి ఏమేరకు జరిగిందంటే ఇప్పటికీ ఉన్న సహజ వనరులను సద్వినియోగం చేసుకోవడంలో వైఫల్యమే కొనసాగుతోంది. సమగ్ర ప్రణాళికలు లోపించాయి. ప్రతిపాదిత ప్రాజెక్టులు ఏవీ ముందుకు సాగడం లేదు. రాష్ట్రం విడిపోయాక ప్రకటించినవీ అతీ గతీ లేవు. ఎన్నికల్లో మేనిఫెస్టోల్లో చెప్పిన అంశాలు అధికారంలోకి వచ్చాక కనిపించడం లేదు. వాటి అమలు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏళ్ల తరబడి వాటిపై హామీలు ఇవ్వడం తప్ప పూర్తి చేసిన దాఖలాల్లేవు. ఇక జిల్లా 1972లో ఏర్పాటవ్వగా 2లో

చెరువులను తలపిస్తున్న వరి పొలాలు 7లో

చిన్నారిని ఎత్తుకెళ్లేందుకు

చిరుత యత్నం

2లో

ఎస్పీ ఎదుట

లొంగిపోయిన ముప్పా సురేష్

2లో

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే దామచర్ల లేఖ

3లో





జిల్లా అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలేవీ.?

(మొదటిపేజీ తరువాయి)

గత ప్రభుత్వం మళ్లీ కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. పాలనాపరమైన సౌలభ్యం ఏమీ లేదు. అసంబద్ధంగా చేసిన జిల్లాల విభజన వల్ల మళ్లీ కొత్త జిల్లాల డిమాండ్ ముందుకు వచ్చింది. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఎన్ని మార్పులు చేసినా అభివృద్ధి ప్రశ్నార్ధకంగా మారింది. జిల్లాలో కీలకమైన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తే 4.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల జనాభాకు తాగునీరు అందించవచ్చు. ప్రాజెక్టు వ్యయం రూ.10 వేల కోట్లకు చేరింది. ఇప్పటికి రూ.6 వేల కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.4 వేల కోట్లు కేటాయించాలి. ఏటా ఇదిగో అదిగో అంటూనే కాలం గడుపుతున్నారు. వచ్చే సీజన్‌కు నీళ్లిస్తామని సిఎం చంద్రబాబు మొన్న జిల్లా పర్యటనలో ప్రకటించారు. మిగతా ప్రాజెక్టులూ ముందుకు సాగలేదు. ఇక వ్యవసాయ రంగం సంక్షోభంలోనే ఉంది. జిల్లాలో ఏ పంట పండించినా గిట్టుబాటు ధరల్లేక రైతులు నష్టాలపాలవుతున్నారు. పొగాకు, శనగ, పత్తి, మిర్చి తదితర వాణిజ్య పంటలు విస్తారంగా పండుతున్నా మార్కెటింగ్ అవకాశాలు సరిగా లేవు. పొగాకు అమ్ముకోవడానికి రోడ్లెక్కాల్సిన పరిస్థితి వచ్చింది. ఉపాధి అంటూ ఏదీ జిల్లాలో లేదు. దొనకొండ, కనిగిరి వద్ద పరిశ్రమల కేంద్రాలను ప్రకటించారు. ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. తీరప్రాంతంలో వాన్‌పిక్ కింద 2008 ప్రాంతంలో 25 వేల ఎకరాలు సేకరించారు. అక్కడా ఒక్క పరిశ్రమ రాలేదు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేవు. కూలీలు వలసలు పోతున్నారు. పట్టణాలకు పోయి బతుకుతున్నారు. తీరప్రాంతంలో అనేక వనరులున్నప్పటికీ అభివృద్ధి ఎండమావిగానే మారింది. పండ్లతోటలు విస్తారంగా ఉన్నాయి. వాటికీ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు లేదు. రొయ్యల సాగు విస్తరించి ఉంది. దీన్ని ప్రోత్సహించే చర్యలూ లేవు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పుతామని గతంలో ప్రకటించారు. అదీ ముందుకు సాగలేదు. జిల్లాను వెనుకబాటు కింద గుర్తించాలని ఆందోళనలు జరిగాయి. ఫలితంగా కేంద్రం వెనుకబడిన జిల్లాల జాబితాలో పెట్టారు. అయితే దానికనుగుణంగా ఎటువంటి చర్యలు లేవు. నిధులు కేటాయించలేదు. ఇప్పుడు కొత్తగా విజన్ డాక్యుమెంట్లు తెరపైకి వచ్చాయి. వివిధ రంగాల్లో రాబోయే ఐదేళ్లలో ఏం చేస్తామనేదీ ప్రకటించారు. 2047 నాటికి అభివృద్ధి ఎంతనేదీ గణాంకాలు రూపొందించారు. కొత్తగా పేదలను సంపన్నులు దత్తతు తీసుకోవాలనే ఉద్దేశంతో పి-4 తెరపైకి తెచ్చారు. జిల్లాలో సహజవనరుల ఆధారంగా అభివృద్ధి ఏమిటనే చర్చ లేదు. ప్రణాళికలు లేవు. అధికారంలోకి రాకముందు ప్రకటించినవి.. తర్వాత కనిపించడం లేదు. ఎన్నికల్లో సంక్షేమ పథకాలు, ఉచిత హామీలతో ఓట్ల కోసం తపిస్తున్నారు. ఇప్పటికీ సగం గ్రామాలకు తాగునీరు లేదు. వేసవి ట్యాంకర్లతోనే మంచినీటిని అందించాల్సి వస్తోంది. ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు. ఎవరు అధికారంలో ఉన్నా జిల్లా అభివృద్ధి విషయంలో ఇదే జరుగుతోంది. 1972 నుంచీ ఇప్పటికీ జిల్లా అభివృద్ధి ఏమిటంటే ఏ రంగంలోనూ సంతృప్తిగా లేదు. అన్ని రంగాల్లో సంక్షోభాలు, సమస్యలు వెంటాడుతున్నాయి. ఇప్పటికైనా సమగ్ర ప్రణాళికలు రూపొందించి.. చిత్తశుద్ధితో ముందుకు సాగితే తప్ప జిల్లా అభివృద్ధి సాధ్యం కాదని గుర్తించాలి.

విద్యుత్ అధికారుల దాడులు

ప్రజాశక్తి -కొత్తపట్నం : కొత్తపట్నం మండలంలో విద్యుత్ అధి కారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అధికారులు 40 బృందాలుగా ఏర్పడి ఏకాలంలో విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. అదనపులోడు సర్వీసులను గుర్తించి వారికి వద్ద రూ. 2,79500 అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిబాబు మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్తును సక్రమమైన పద్ధతిలో వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిపి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హైమావతి, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం హరిబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి శ్రీకాంత్, టౌన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పాండురంగారావు, చీమకుర్తి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోహన్ రావు, ఎఇలు,ఎల్ఐ, ఎల్ఎం, జెఎల్ఎంలు పాల్గొన్నారు.

చిన్నారిని ఎత్తుకెళ్లేందుకు చిరుత యత్నం

- తండ్రి కేకలు వేయడంతో వదిలి వెళ్లిన వైనం

- చిన్నారుట్ల చెంచుగూడెంలో ఘటన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఓ చిన్నారిపై చిరుత దాడి చేసింది. ఈ ఘటన పెద్దదోర్నాల మండలంలోని చిన్నారుట్ల చెంచు గిరిజన గూడెంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అటవీ ప్రాంతం నుంచి గ్రామంలోకి చొరబడ్డ చిరుతగూడెంలోని ఓ ఇంట్లో తల్లిదండ్రుల మధ్యలో నిద్రిస్తున్న చిన్నారిపై దాడి చేసింది. చిన్నారి తండ్రి అప్రమత్తతతో ఆ పాప ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది.

వివరాల్లోకి వెళితే.. కుడుముల అంజయ్య, భార్య రాజేశ్వరి తమ మూడు సంవత్సరాల పాపతో పాటు తమ గుడిసెలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో అకస్మాత్తుగా చిరుత గుడిసె లోపలికి వచ్చింది. పాప తలను పట్టుకొని అడవి వైపు తీసుకెళ్తుండగా తండ్రి అంజయ్య మేల్కొన్నాడు. తన కూతురిని చిరుత నోట్లో ఉండటాన్ని చూసి పెద్దపెద్దగా కేకలు వేస్తూ వెంట పడ్డారు. దీంతో భయపడ్డ చిరుత పులి పాపను వదిలేసి చీకట్లో అదృశ్యమైంది. కుటుంబసభ్యులు, పొరుగు వారు తీవ్ర గాయాలతో ఉన్న పాపను సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పాప తల, మెడ భాగాల్లో గాయాలు ఉన్నప్పటికీ ప్రాణాపాయం లేదని తెలిపారు. గ్రామస్తుల సమాచారం ప్రకారం గత వారం రోజులుగా రాత్రి వేళల్లో చిరుత పులి గ్రామ పరిసరాల్లో తిరుగుతోంది. మేకలు, కోళ్లు, ఆవు దూడలను ఎత్తుకెళ్లింది. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసినా వారు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారుట్ల చెంచుల ధర్నా..

తమ గూడేనికి కరెంట్ లేకపోవడంతో అటవీ జంతువులు తమపై దాడి చేస్తున్నాయని చెంచులు వాపోయారు.కరెంట్ సౌకర్యం కల్పించి అటవీ జంతువుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ పెద్దదోర్నాల-శ్రీశైలం రహదారిలో చిన్నారుట్ల చెంచుగూడెం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. చిరుతపులి మూడేళ్ల పాపను తీసుకెళ్లడం తండ్రి గమనించకపోతే చనిపోయేదని పేర్కొన్నారు. పశువులను చిరుతలు చంపుతూనే ఉన్నాయని చెప్పారు. తమకు రక్షణ కల్పించకపోతే ప్రాణాలు పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వచ్చి హామీ ఇచ్చే వరకు ధర్నా విరమించేది లేదని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్ఒ హరి విషయాన్ని ఫీల్డ్ డైరెక్టర్ సందీప్ కృపాకర్‌కు తెలియజేయడంతో సందీప్ కృపాకర్, ఎస్ఐ పి మహేష్‌లు ధర్నా ప్రాంతానికి చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో చెంచులు ధర్నాను విరమించారు.



పులిదాడితో చిన్నారి మెడపైఅయిన గాయం

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-టంగుటూరు

ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రకాశంజిల్లా 8వ మహాసభ టంగుటూరులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 21 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎం. రమేష్, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులుగా గర్నెపూడి అబ్రహాం, పేరాబత్తిన శ్రీనివాసులు, జిల్లా ట్రెజరర్‌గా నలతోటి ఎలిషా, జిల్లా ఉపాధ్యక్షులుగా ఆలూరి ఇశ్రాయేల్, ఇత్తడి దీనమ్మ, కె. శ్రీనివాసులు, కార్యదర్శులుగా రాచూరి ప్రకాశం, ఆనందరావు, అరుణ్ కుమార్‌తో మరో 11 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. జిల్లా మహసభ ఏకగ్రీవంగా పలు తీర్మానాలను ఆమోదించింది. గ్రామపంచాయతీ కార్మికులందరికీ మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్నట్లుగానే రూ. 21 వేతనం చెల్లించాలని, జూన్‌లో జిల్లా కలెక్టర్ నిర్ణయించిన కనీసవేతనం పంచాయతీల్లో అమలు చేయాలని, ప్రతి నెలా మొదటివారంలో జీతాలు ఇవ్వాలని, గ్రామపంచాయితీ కార్మికులకు, స్వచ్ఛభారత్ కార్మికులకు జీతాలు బకాయిలు వెంటనే చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, విధుల నిర్వహణలో గాయపడిన వారికి వైద్య సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, స్వచ్ఛ భారత్ కార్మాకులకు చట్టబద్ధమైన సెలవులన్ని అమలు చేయాలని తీర్మానించారు. 132,142,680 జీవో లను అమలు చేయాలని, అమలు చేయని అధికారులపై చట్టబదదమైన చర్యలు తీసుకోవాలని, టెండర్ల విషయంలో 2015 మరియు 2023 హైకోర్టు తీర్పులను అమలుచేయాలని, కార్మికులకు ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, దహన సంస్కారాలకు రూ.20 వేలు ఇవ్వాలని, పంచాయతీ ఆదాయంలో కార్మికుల వేతనాలు చెల్లించటానికి ఉన్న పరిమితిని ఎత్తివేయాలని జిల్లా మహా సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు.



నూతన కమిటీ ఇదే..

ఎస్‌పి ఎదుట లొంగిపోయిన ముప్పా సురేష్

- ఈయన వీరయ్య చౌదరి హత్య కేసులో ఎ1 నిందితుడు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

జిల్లాలో సంచలనం సష్టించిన తెలుగ ుదేశం నేత ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో ఎ1 నిందితుడు ముప్పా సురేష్ గురువారం నాడు ప్రకాశం జిల్లా యస్.పి ఎ.ఆర్.దామోదర్ ఎదుట లొంగిపోయాడు. ఈ సంవత్సరం ఏప్రిల్ 22న వీరయ్యచౌదరిని ఒంగోలులోని అతని కార్యాలయంలోనే నిందితులు అత్యంత పాశవికంగా కత్తులతో పొడిచి హత్య చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సష్టించిన ఈ కేసును జిల్లా యస్.పి ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విచారణ చేపట్టారు. దాదాపు వందమందికి పైగా అనుమానితులను విచారించారు. నెల రోజుల తరువాత నిందితులను గుర్తించారు. ఎ1 గా వున్న ముప్పా సురేష్ మినహా మిగిలిన నిందితులందరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడంతో కోర్టు నిందితులందరికీ రిమాండ్ విధించింది. ప్రధాన ముద్దాయిగా వున్న ముప్పా సురేష్ అరెస్టు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో దరఖాస్తు చేయగా హైకోర్టు తిరస్కరించింది. అనంతరం సుప్రీంకోర్టులో కూడా బెయిల్ కోసం ప్రయత్నం చేయగా అక్కడ కూడా తిరస్కారం ఎదురైంది. దీంతో సురేష్‌కి పోలీసుల ముందు లొంగిపోవడం తప్ప మరో మార్గం లేకపోవడంతో గురువారం జిల్లా ఎస్‌పి ఎదుట లొంగిపోయాడు.

నూతన దంపతులకు ఆదిమూలపు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని మిట్టపాలెం గ్రామ వైసిపి నాయకుడు మద్దినేని రామారావు కుమార్తె వివాహం జరిగింది. అందులో భాగంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్. ఆదిమూలపు సురేష్ గురువారం రామారావు నివాస గృహానికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నెన్నూరపాడు గ్రామంలో వైసిపి నాయకులు పాలవెల్లి వెంకటేశ్వరరెడ్డి కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మారెడ్డి వెంకటేశ్వర్లు, రమణయ్య, మండల మాల కొండయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దామచర్ల సత్యకు సత్కారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు శీలం రాము నివాసం గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొని రాము కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యను రాము దంపతులు పూలమాలతో సత్కరించారు. దామచర్ల వెంట టిడిపి నాయకులు చీమకుర్తి కష్ణ, మించల బ్రహ్మయ్య, సుదర్శి ప్రసాదరావు, కనిగిరి వెంకటేశ్వర్లు, శీలం చంటి, ముళ్ళపూడి సత్యనారాయణ ఉన్నారు.

వ్యవసాయ భూమిని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి- మద్దిపాడు : మండల పరిధిలోని ఏడుగుండ్లపాడులో వ్యవసాయ భూమిని ఆర్‌డిఒ లక్ష్మీ ప్రసన్న గురువారం పరిశీలించారు. సంబంధిత భూ యజమాని వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకొనుటకు దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగా ఆర్‌డిఒ ఆ భూమిని పరిశీలించారు. ఆ భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు కార్యక్రమంలో ఆర్‌డిఒ సిసి రామకష్ణ, తహశీల్దారు ఆదిలక్ష్మి, ఆర్ఐ రమణయ్య, సర్వేయర్లు సుశీల్, సతీష్ పాల్గొన్నారు.

బిటెక్ అడ్మిషన్లలో ‘ పేస్’ కు అగ్రస్థానం

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఏపీ సెట్ కన్వీనర్ కోటా సీట్లు కేటాయింపులో మరోసారి పేస్ ఇంజనీరింగ్ కళాశాల అడ్మిషన్లలో జిల్లాలోనే అగ్రస్థానంగా నిలిచి ప్రభంజనం సష్టించింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో ఏపీ సెట్ లో పేస్ కాలేజ్ ను ఆప్షన్ గా ఎంచుకున్న ప్రతి విద్యార్థినీ, విద్యార్థికి, వారి తల్లిదండ్రులకు కతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ కళాశాల మీద పెట్టుకున్న నమ్మకాన్ని ఎప్పటిలాగే నిలబెట్టుకుంటామని ఆయన తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ,నైపుణ్య శిక్షణ తరగతులు మొదటి సంవత్సరం నుంచి ప్రారంభించి అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగాలు కల్పిస్తామని మద్దిశెట్టి శ్రీధర్ తెలియజేశారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కొండపి

ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దకండ్లగుంట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రేమ్ కుమార్ కథనం ప్రకారం.. పెద్దకండ్లగుంట గ్రామానికి చెందిన మహేంద్ర ఓ షాపులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి కూడా పనిచేశాడు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో పెద్ద కండ్ల గుంటలోని జగనన్న కాలనీలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కారును బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చదలవాడ గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... కొరిశపాడు మండలం పమిడిపాడుకు చెందిన పాలేటి ఆంజనేయులు, కొడివెండ్ల నారాయణస్వామి ఒంగోలు నుంచి బైకుపై స్వగ్రామానికి బయలు దేరారు. ఘటన స్థలం వద్దకు వెళ్లి సర్వే నాగులుప్పలపాడు నుంచి ఒంగోలు వైపు కారు వస్తుంది. ఈ క్రమంలో బైకు అదుపు తప్పి కారును ఢీకొంది. దీంతో బైకు ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

18 నుంచి పొగాకు బ్యారెన్లకు రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-కొండపి



2025-26 సంవత్సరానికి పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈనెల 18 నుంచి ప్రారంభమవుతున్నట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం భారత వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ ఏడాది నుంచి మూడు సంవత్సరాల ఒకసారి పొగాకు బ్యారెన్లను రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి మూడు సంవత్సరాలకు సాగు ప్రణాళికను చేపట్టాలన్నారు. పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల మాత్రమే పొగాకు పంటను సాగు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు ఎట్టి పరిస్థితులలోనూ పొగాకు పంటను సాగు చేయకూడదని తెలిపారు. అనధికారికంగా బ్యారెన్లు నిర్మించవద్దని తెలిపారు. 2025 -26 సంవత్సరం పంట కాలానికి ఎఫ్‌సివి పొగాకు ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు అవసరాల దష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్లో 142 మిలియన్ల కిలోల పంట ఉత్పత్తిని నియంత్రించినట్లు తెలిపారు.అక్టోబర్ 22 వరకూ అపరాధ రుసుం లేకుండా రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చునని తెలిపారు. రూ.100 అపరాధ రుసుంతో నవంబర్ 7 వరకూ. రూ.400 అపరాధ రుసుముతో నవంబర్ 19 వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు మరో మూడు సంవత్సరాలు 2027- 28 పంట కాలం వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవలసిన అవసరం లేదని వివరించారు. ఎఫ్‌సివి పొగాకు విత్తనాలు కందుకూరు,రాజమండ్రి ఎన్ఐ ఆర్ సిఎ(సిటిఆర్ టి) వద్ద అందజేస్తున్నట్లు తెలిపారు. లోగ్రేడ్ పొగాకు ఉత్పత్తిని తగ్గించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

మంత్రి స్వామి ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొండపి : మండల పరిధిలోని నెన్నూరుపాడులో కట్టా వారి వివాహావేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి స్వామి పాల్గొని వరుడు అంకిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ జి.రామయ్యచౌదరి, బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి మద్దిపాడు : మండల పరిధిలోని మల్లవరం గ్రామానికి చెందిన మార్నేని కోటిలింగయ్య నూతన గృహప్రవేశ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే బిఎన్.విజయ్ కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ మార్నేని రాఘవ, దొడ్డవరం సొసైటీ ప్రెసిడెంట్ సుబ్బారావు పాల్గొన్నారు.

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

- కందుకూరు, అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలపాలి
- మంత్రివర్గ ఉప సంఘానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని, కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లలో కలపాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మంత్రి వర్గ ఉప సంఘాన్ని కోరారు. ఈ మేరకు దామచర్ల మంత్రివర్గ ఉప సంఘానికి లేఖ రాశారు. ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన గిద్దలూరు, యర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాలు జిల్లా కేంద్రమైన ఒంగోలుకు చాలా సుదూరంలో ఉన్నాయన్నారు. యర్రగొండపాలెం నుంచి సుమారు 140 కిలోమీటర్లు, గిద్దలూరు నుంచి సుమారు 145 కిలోమీటర్లు, మార్కాపురం నుంచి సుమారు 100 కిలోమీటర్ల దూరంలో జిల్లా కేంద్రం ఒంగోలు ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు జిల్లా కేంద్రంలో పనులు కోసం వచ్చే క్రమంలో చాలా అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కారణంగా ప్రజల నుంచి వచ్చిన అభ్యర్ధనల మేరకు, గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉప సంఘానికి కోరారు. నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గం జిల్లా కేంద్రానికి సుమారు 110 కిలోమీటర్లు దూరంలో ఉందన్నారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గం, జిల్లా కేంద్రమైన బాపట్లకు సుమారు 82 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలుకు, కందుకూరు సుమారు 42 కిలోమీటర్లు, అద్దంకి సుమారు 43 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. ప్రజల అభ్యర్ధనలు, పరిపాలనా సౌలభ్యం కోసం కందుకూరు , అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో చేర్చాలని కోరారు. జిల్లా, మండల, గ్రామ పేర్లు సరిహద్దుల మార్పులపై ఇటీవల ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కోరారు.







గిరిజనుల భూ సమస్య పరిష్కరించాలి : సిపిఎం


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని కూకట్లపల్లి గిరిజనుల భూ సమస్య ను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. స్థానిక తహశీ ల్దారు కార్యాలయం వద్ద గురువారం గిరిజన రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు దశాబ్దా లుగా గిరిజనులు ప్రభుత్వం ఇచ్చిన భూ ములు సాగు చేసుకుంటున్నప్పటికీ రికార్డుల్లో సక్రమం గా నమోదు చేయలేదని అన్నారు. రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించారని, కానీ పరిష్కరించలేదని గిరిజనులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. వెనుకబడిన గిరిజనుల సమస్యల పట్ల ప్రభుత్వ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. సరైన రికార్డు లేనందున బ్యాంకు రుణాలు, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకా లకు నోచుకోవడం లేదన్నారు. తక్షణమే భూములు సక్రమైన పద్ధతుల్లో రికార్డుల్లోకి ఎక్కించాలని కోరారు. లేకుంటే గిరిజనులు చేసే పోరాటాలకు తాము అండగా ఉంటామని తెలిపారు. అనంతరం గిరిజనులు వ్యక్తిగత అర్జీలను తహశీల్దా రుకు అందించారు. తహశీల్దారు నాయక్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి పావులూరి రమణయ్య, గొల్లపూడి అంజయ్య, వీరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి తొలి ప్రాధాన్యత: ఏలూరి


మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని, అభివృ ద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాల యంలో డ్వామా, పంచాయతీరాజ్ శాఖల అధికారుల తో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత లో రాజీ పడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. 2014-19 మధ్య చేసిన పనుల పెండింగ్ బిల్లులు సత్వరమే మంజూరు చేసేలా చొరవ చూపాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమానికి తమ ప్రభుత్వం సమ ప్రాధా న్యత ఇస్తుందన్నారు. భవిష్యత్ తరాలకు బాటలు వేసేందుకు సిఎం చంద్రబాబు ప్రణాళికతోఅభివృద్ధి చేస్తున్నారని అన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైయిన్లు, మంచినీటికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఏడాదిలో అద్భుత పాలన సాగించడం వల్లే పులివెం దుల ప్రజలు సైతం తమ ప్రభుత్వానికి పట్టం కట్టారని గుర్తు చేశారు. పులివెందుల ప్రజలు 30ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్యాన్ని చూశారని అన్నారు. ప్రభుత్వానికి పులివెందుల ప్రజలు అపూర్వం మద్దతు తెలిపారని అన్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతు పలికిన పులివెందుల, ఒంటిమిట్ట ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. జగన్ పాలనలో దౌర్జన్యం, అరాచకం విధ్వంసం రాజ్యమేలుతుందని, చంద్రన్న పాలనలో అభివృద్ధి సంక్షేమం పరుగులు తీస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో సిఎం చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నిటిని అమలు చేస్తుందన్నారు. సమావేశంలో డ్వామా పిడి విజయలక్ష్మి, పంచాయతీరాజ్ డిఈ ఆదినారాయణ, ఆర్డబ్ల్యూఎస్ డిఈ సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి


ఎంఎల్ఎను కలిసిన గురుకుల పాఠశాల సిబ్బంది

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల సిబ్బంది శాసన సభ్యులు ఏలూరు సాంబ శివరావును ఆయన కార్యా లయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలి శారు. పాఠశాల్లోని పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, భవాని, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

ముంపు నివారణకు చర్యలు

ప్రజాశక్తి -రేపల్లె

విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంటల ముంపు నివారించేం దుకు చర్యలు చేపట్టాలని ఎఒ ఎ మహేష్ సూచించారు. పొలాల నుంచి మురుగు నీటిని తీసివేయాలని తెలి పారు.

పొగాకు సాగు చేయవద్దు

అద్దంకి : అనుమతి లేకుండా పొగాకు సాగు చేయవద్దని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలో కొన్ని కంపెనీలు రైతుల వద్దకు వెళ్ళి పొగాకు సాగు చేయమని బాండ్లు ఇస్తున్నట్లు తెలిసిం దని అన్నారు. నల్లబర్లీ, తెల్ల బర్లీ పొగాకు సాగు జిల్లాలో నిషేధించి నట్లు తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వులు అతిక్రమిం చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత పొగాకు నిల్వలు కంపెనీలు కొనకుండా మళ్ళీ రైతులతో పొగాకు సాగు చేయాలని ప్రోత్సహించడం క్షమించరాని నేరమన్నారు.




నిరసన తెలుపుతున్న వెలుగు సిబ్బంది

వెలుగు సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - పంగులూరు

అన్నమయ్య జిల్లాలో ఎపిఎం రజినిపై జరిగిన దాడిని ఖండిస్తూ కోరిసపాడులోని వెలుగు కార్యాలయం ముందు సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో గురువారం నిరసన తెలిపారు. ఏపిఎం రజినిపై కొంతమంది కావాలనే దాడి చేశారని అన్నారు. ఈ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిబ్బంది నిరసన తెలుపుతున్నట్లు సిసి యూనియన్ జిల్లా అధ్యక్షులు చాట్ల సాల్మన్ అన్నారు. విధులకు నల్లబ్యాడ్జీలతో హాజరై నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఎపిఎం మాణిక్యరావు, శ్రీనిధి మేనేజర్ నాగ శంకర్, సాంబయ్య, సురేష్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

డ్రా ద్వారా బార్లు కేటాయింపు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బార్ పాలసీ విధానంతో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును ఆరు విడతలుగా చెల్లించుకోవచ్చని ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి బి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాస్థాయిలో బార్ లైసెన్స్ యజమానులతో స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో 17 బార్లు ఉన్నట్లు తెలిపారు. డ్రా పద్ధతిలో వీటిని కేటాయిస్తారని తెలిపారు. ఏడాదికి రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజును ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. లైసెన్స్ ఫీజు ఏడాదిలో 6 విడతలుగా చెల్లించుకునే విధంగా ప్రభుత్వం వ్యసులుబాటు కల్పించిందని అన్నారు. బార్ పనిచేయు వేళలు, మార్పులు చేసినట్లు తెలిపారు. ఉదయం10 గంటల నుండి అర్ధరాత్రి12 గంటల వరకు బార్లు తెరిచి ఉంచే విధంగా సమయం పెంచినట్లు తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ సిఐ పి గీతిక, అధికారులు, బార్ యజమానులు పాల్గొన్నారు.


ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న అధికారులు

నిరుపేదలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రకృతి వైపరీత్యాలకు కష్టాల్లో ఉన్న నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆర్డిఓ పి గ్లోరియా కోరారు. ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని 3వ వార్డు రాజీవ్ గాంధీ కాలనీలో గిరిజన కుటుంబాలకు ఆర్డీఒ గ్లోరియా, తహశీల్దారు సలీమా, కమిషనర్ రఘునాధరెడ్డితో కలసి ఆహార పొట్లలు గురువారం అందజేశారు. ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో గౌరవాధ్య క్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షులు బండ్రెడ్డి గోపి, కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్, కోశాధికారి జోగి సువర్ణరాజు, మద్దిబోయిన గోపి, భీమా కోటేశ్వరరావు, విన్నకోట శ్రీనివాసరావు, బండి శ్రీనివాసరావు, యలవల శ్రీనివాస రావు, తన్నీరు గోపి, షేక్ మహబూబ్ సుభాని, సిహెచ్ వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి అంకమ్మరావు, శ్రీనివాసరావు, కె రవి పాల్గొన్నారు.


డాక్టరేట్ అందుకుంటున్న యన్నం సురేష్

సురేష్‌కు భారత సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - బట్టిప్రోలు

మండలంలోని పెసర్లంకకు చెందిన దళిత ఉద్యమ నాయకులు యన్నం సురేష్ పలు అవార్డులను అందుకు న్నారు. హైదరాబాద్ కళాభారతిలో మనం ఫౌండేషన్ 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కల్చరల్ ప్రోగ్రామ్స్, అవార్డులు అందజేశారు. యన్నం సురేష్ వివిధ రంగాల్లో చేసిన సేవలు గుర్తించి ఆయనకు 'భారత సేవారత్న' జాతీయ అవార్డు, గౌరవ 'డాక్టరేట్' అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఇప్పటికే తాను చేసే అనేక కార్యక్రమాలు గుర్తించి అవార్డులు వచ్చాయనీ అన్నారు. ప్రస్తుత అవార్డులు రావటం సంతోషంగా ఉందని, తన బాధ్యత పెంచాయని అన్నారు. తన తండ్రి పేరుతో పెట్టిన వైపి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మిత్ర బృందం సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆయన మిత్ర బృందం జంగం వాసు, బుల్లెద్దు ప్రతాప్, జంపాని రవి, శొంఠి కామేశ్వరరావు, పీజీ అరుణశాస్త్రి, కంభం సురేష్, యలవర్తి ప్రవీణ్, మోర్ల కోటేశ్వరరావు, యన్నం చింటూ, శొంఠి వేణు, జడ రవీంద్రబాబు, పెనుమాక వినయ్, బోలిమేర రాజు అభినందించారు.


దోమతెరలు పంపిణీ చేస్తున్న విజయమ్మ

దోమతెరలు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

కుష్టు వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ కోరారు. పట్టణలోని బేతనీ కాలనీలో 130 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు ఎపి స్టేట్ లెప్రా సొసైటీ సహకారంతో దోమతెరలు గురువారం పంపిణీ చేశారు. లెప్రసీ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకుని క్రమం తప్పకుండా మందులు తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఏ పని చేసుకోలేని కొంత మంది కుష్టి వ్యాధిగ్రస్తులను దయార్ధ హృదయంతో దాతలు ఆదుకోవాలని కోరారు. కుష్టు వ్యాధి అంటురోగం కాదన్నారు. వారికి తగిన మేర సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల న్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, టీబీ, హెచ్ఐవి అధికారి మహమ్మద్ సాదిక్, లెప్రా సొసైటీ ప్రతినిధి నాగరాజు, డిపిఎంఓలు యువి సుబ్బరాజు, డి శ్రీనివాసరావు, ఎఎన్ఎం శ్రీదేవి పాల్గొన్నారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివకుమార్

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు ఉంటాయని చందోలు ఎస్ఐ శివకుమార్ హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని అన్నారు. రెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేశారు. వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు తమతో ఉండాలని అన్నారు. అనుకోని రీతిలో ప్రమాదాలకు గురైతే హెల్మెట్ ప్రాణాలు కాపాడుతుందని అన్నారు. చట్టాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూగర్భ నీటిమట్టం పెంపుపై ప్రత్యేక దృష్టి

సిఎంకు వివరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పశ్చిమ ప్రాంతంలో పడిన భూగర్భ నీటిమట్టం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కలెక్టర్ తమీమ్ అన్సారియా వివరించారు. భూగర్భ నీటిమట్టం పెంపు, సమర్ధవంతంగా వరద నీటి నిర్వహణపై గురువారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడుకి కలెక్టర్ ప్రకాశం జిల్లాలోని పరిస్థితిని వివరించారు. కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ, డిఆర్‌ఓ బి. చిన ఓబులేసు, ఇరిగేషన్ ఎస్.ఈ వరలక్ష్మి, ఇరిగేషన్ అధికారులతో పాటు సాగునీటి సంఘాల ఛైర్మన్లు(డిసిలు, పిసిలు, డబ్ల్యుయుఏలు), వైస్ ఛైర్మన్లు పాల్గొన్నారు.

'జడ్పీటీసీ'ల గెలుపు సిఎం దక్షతకు నిదర్శనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి ఎన్నికలలో టిడిపి గెలుపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనా దక్షతకు నిదర్శనమని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కొనియాడారు. కూటమి ప్రభుత్వం వైపే ప్రజలు ఉన్నారని జగన్ తెలుసుకోవాలని, రౌడీయిజం చేసి, అరాచకాన్ని సృష్టించి ఎన్నికల్లో గెలవాలని చూస్తే ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో స్వాతంత్ర్య వేడుకలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్లలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. భారీ వర్షాల కారణంతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాతీయ పండుగను నిర్వహించాలన్నారు. బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం సంబంధిత కళాశాల ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. వర్షాలు వచ్చినప్పటికీ జాతీయ పండుగను వైభవంగా జరపాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు,



వేడుకలకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

శకటాలు, స్టాల్స్ ప్రదర్శన నిర్వహించే ప్రాంతాలను ఆయన పరిశీలించారు. త్వరగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఆర్డీవో గ్లోరియా, తదితరులు ఉన్నారు.

చెత్త తరలింపు కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కొత్తమామిడిపాలెంలో గల చెత్త తరలింపు కేంద్రాన్ని ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మరియు మేయర్ చెత్త తరలింపు కేంద్రం ఆవరణలో గల నగరపాలక సంస్థ సిబ్బందితో నిర్వహిస్తున్న వర్మీ కంపోస్ట్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడ చెత్త కుప్పలు లేకుండా చెయ్యడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. దానిలో భాగంగా ఇక్కడ వర్మీ కంపోస్ట్ ద్వారా ఎరువులను తయారు చేస్తున్నట్లు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

తెలిపారు. పేర్నమిట్ట ప్రాంతంలో చెత్త తరలింపు కేంద్రాన్ని త్వరలో ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఇసాయ్య, మున్సిపల్ ఆరోగ్యాధికారి వైష్ణవి, శానిటరీ ఇన్స్పెక్టర్ బాబ్జి, ఎఇ నాగార్జున, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలియజేశారు.













వాటర్ ప్లాంట్ రోడ్డులో వద్ద నిలిచిన వర్షపు నీరు

పర్చూరులో జోరు వాన

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం గురువారం కురిసింది. ఉదయం నుండి వర్షం కురుస్తుండడంతో గ్రామంలోని డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. డ్రైనేజీ వాటర్ రోడ్డుపై చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పర్చూరు, చీరాల ఆర్ అండ్ బి రోడ్డులో సినిమా హాలు సెంటర్లో మోకాలు లోతు నీరు నిలవడంతో వాహనాల రాకపోకులకు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. మసీదు నుండి జండా చెట్టు బజారులో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీటితో మురుగు కాలువ నిండి రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుంది. మంచినీటి ప్లాంట్ రోడ్డులోని వేణుగోపాల స్వామి ఆలయం ఎదురుగా మురుగునీరు కాలువ వ్యవస్థ లేకపోవడంతో వర్షం నీరంతా రోడ్డుపై నిలిచింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వైట్ బర్లి పొగాకు మండేలకు కాపలా కాయలేక రైతులు ఇబ్బందులకు గురయ్యారు. తడుస్తుందేమోనని ఆందోళనకు గురయ్యారు. గ్రామాల్లో బర్లీపొగాకు మండెలు ఉండటంతో ఈ గాలి, వర్షం రావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఖరీఫ్ వ్యవసాయానికి ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

బోడవాడలో నేత్ర దానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

పంగులూరు మండలంలోని బోదవాడలో కొమ్మారెడ్డి వీరారెడ్డి (98) వృద్ధాప్యరీత్యా అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలు దానం చేశారు. పెద్దకాకాని శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి రాఘవరెడ్డి కంటి కార్నియా సేకరించారు. నేత్రదానం చేసిన కుమారుడు అంజయ్యరెడ్డి, కోడలు రమాదేవి, కూతురు అంజమ్మ, అల్లుడు వెంకటేశ్వరరెడ్డిని ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు జట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహనరావు, రోటరీ అధ్యక్షులు అలవల అంజిరెడ్డి అభినందించారు.



చేప పిల్లలను వదులుతున్న కమిషనర్ సాంబశివరావు

గంబూషియా చేపలతో దోమల నివారణ

ప్రజాశక్తి - రేపల్లె

దోమల ఉధృతి నివారించేందుకు నీటి కుంటల్లో గంబూషియా చేపలు ఎంతో దోహదపడతాయని, దోమల నివారణలో కీలకపాత్ర పోషిస్తాయని కమిషనర్ కె సాంబశివరావు పేర్కొన్నారు. ప్రజలు అంటువ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని అన్నారు. ప్రతి ఇంట్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. శానిటరి ఇన్స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - మెదరమెట్ల

మేదరమెట్ల గ్రామానికి చెందిన షేక్ జిలాని భాష (27) తమ్మవరం నుండి వెంపరాల వెళ్లే క్రమంలో మేదరమెట్ల సెయింట్ ఆర్నాల్డ్స్ స్కూల్ వద్దకు వచ్చేసరికి విజయవాడ నుండి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో మృతి చెందాడు. ప్రథమ చికిత్స కోసం మేదరమెట్ల పీహెచ్సీకి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మందేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సొంత గడ్డపైనే 'జగన్' విఫలం

పులివెందుల విజయంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - పంగులూరు

మాజీ సిఎం జగన్ మోహన్‌రెడ్డి సొంత గడ్డ పులివెందులలో పూర్తిగా విఫలం అయ్యాడని, అక్కడి ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసి తెలుగుదేశంను గెలిపించటం ఆనందదాయకమని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరంలోని తెలుగుదేశం కార్యాలయంలో ఆయన విలేకరులతో గురువారం మాట్లాడారు. అసెంబ్లీకి కూడా హాజరు కానీ వ్యక్తి ప్రతిపక్ష నేతగా కూడా అవసరం లేదని పులివెందుల ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు. సొంత గడ్డపై ఉన్న ప్రజలే జగన్‌ను నమ్మలేదని అన్నారు. ఆయన మీద నమ్మకం లేకనే తెలుగుదేశం జడ్పిటిసి అభ్యర్థిని గెలిపించుకున్నారని అన్నారు. ఇంతకాలం పులివెందుల తన సొంత జాగీరుగా భావించి తనకు ఎదురు లేదని అంటున్న జగన్‌కు ఈ ఫలితం చెంప పెట్టు వంటిదని అన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం రోడ్లను మరిచిపోయిందని అన్నారు. విద్యుత్ శాఖను వైసిపి పూర్తిగా సర్వనాశనం చేసిందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ శాఖను గాడిలో పెట్టామని అన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్యుత్తు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1500 కొత్త బస్సులను ఆర్టీసీకి కొనుగోలు చేసి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చంద్రబాబు పనిచేస్తున్నాడని చెప్పారు. అద్దంకిలో ఇప్పటివరకు 1,021 మందికి సిఎం సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అందించామని అన్నారు. రాష్ట్రంలో రూ.400 కోట్లు సీఎం సహాయనిధి ద్వారా ప్రజలకు అందించామని అన్నారు. పులకమ్మ ప్రాజెక్టు గేట్లన్ని బాగు చేయించామని, వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకున్నామని అన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

జిల్లాల పునర్విభజన గురించి ఒక విలేకరి ప్రశ్నించగా పునర్విజన కమిటీ వేశారని, ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా మార్చమని ప్రభుత్వాన్ని అడుగుతున్నామని అన్నారు. రెవిన్యూ డివిజన్ దూరంగా ఉండటం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని అన్నారు. నల్లబర్లి పొగాకు కొనుగోలు విషయంలో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రభుత్వ గోడౌన్లు మొత్తం పొగాకు చెక్కులతో నిండిపోయాయని అన్నారు. అధికారులు గోడౌన్లను పరిశీలిస్తున్నారని అన్నారు. రైతుల దగ్గరున్న పొగాకు మొత్తం ప్రభుత్వం కొంటుందని, 20 క్వింటాళ్లలోపు ఉన్న చిన్న రైతుల పొగాకును ముందుగా కొంటారని చెప్పారు. అంతకుముందు పలువురికి సిఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రావూరి రమేష్ బాబు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, ఓబులురెడ్డి, ముప్పవరం సొసైటీ అధ్యక్షులు అల్లం నేని బ్రహ్మానంద స్వామి, గొట్టిపాటి కాజా స్వామి, మండల ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, మురకొండ సుబ్బారావు, గుర్రం ఆదిశేకర్, వలపర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి- చీరాల

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మునిసిపల్ అధికారులు పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ గురువారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నియోజక వర్గం అధికార ప్రతినిధి ఎం మహేంద్రనాథ్ ర్యాలీ ప్రారంభించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం, బస్టాండ్ సెంటర్ మీదగా గడియార స్థంభం వద్దకు చేరుకొని మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన సభ్యులు కొండయ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పట్టణంలో జరుగుతున్నట్లు తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణం చీరాలలో ప్రారంభించేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. గతంలో లేని గడియార స్తంభాన్ని ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించి ప్రజలకు అంకితం చేస్తామని అన్నారు. జాతీయ జెండా చేపూని విద్యార్థులు చేపట్టిన ర్యాలీ ఆకట్టుకుంది. ర్యాలీలో చైర్మన్ మించాల సాంబశివ



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో మహేంద్ర నాథ్

రావు, కమిషనర్ అబ్దుల్ రషీద్, ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్దన్, డిఈ రఘురాం, మెప్మా సిఎంఎం డిసిహెచ్ కొండయ్య పాల్గొన్నారు.

సంతమాగులూరు : జాతీయ పతాకాన్ని ప్రతి పౌరుడు తమ ఇంటిపై ఎగరవేసి దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటాలని జెడ్పి ఉన్నత పాఠశాల హెచ్ఎం మాధవి తెలిపారు. మండలంలోని ఏల్చూరు జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాతో హర్ ఘర్ తిరంగి ర్యాలీ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ ప్రమీల, మహిళా పోలీసులు మహాలక్ష్మి, అమీన్, పాల్గొన్నారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రకాశం బ్యారేజీ వద్ద దిగువకు నీటిని విడుదల చేయటంతో కృష్ణా నది కరకట్ట వెంట ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెనుమూడి కృష్ణానదిని సందర్శించి వరద ఉధృతిపై సమీక్షించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్ఐ రాంబాబు, ఎంపిడిఒ డివి రమేష్ బాబు, ఈఓపిఆర్డి ప్రసాద్ బాబు, విఆర్ఓ రవి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : కృష్ణా నదికి ప్రకాశం బ్యారేజ్ నుండి విడుదల చేసిన వరద నీటితో లంక గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు అప్రమ త్తంగా ఉండాలని తహశీల్దారు మేకా శ్రీనివాసరావు సూచించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో అధి కారులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహిం చారు. ప్రస్తుతం కృష్ణా నదికి 5లక్షలకుపైగా క్యూసె క్కుల వరద నీరు



సూచన చేస్తున్న రేపల్లె తహశీల్దారు శ్రీనివాసరావు

కొనసాగుతుందని అన్నారు. మండ లంలో పెదలంక, పెసర్లంక, చింతమోటు, ఓలేరుపల్లె పాలెం గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దారు శాంత లక్ష్మి, విద్యుత్ ఏఈ శాంతకుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సంపూర్ణ, ఆర్ఐ శివరామకృష్ణ, ఫణి కుమార్, వెల్లటూరు, బట్టిప్రోలు పిహెచ్‌సిల వైద్యులు, విఆర్ఓలు పాల్గొన్నారు.



ఉప్పుటూరులో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - పర్చూరు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉప్పుటూరు హెూమియో వైద్యులు డాక్టర్ డి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని ఉప్పుటూరులో ఇంటింటికి తిరిగి డెంగ్యూ జ్వరం సర్వే గురువారం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాకాల సీజన్లో విష జ్వరాలు సోకుతున్నాయని తెలిపారు. ప్రజలందరూ వైద్య సిబ్బందికి సహకరించాలని తెలిపారు. కుంటల్లో, కొబ్బరి చిప్పల్లో, టైర్లలో, కూలర్లలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం ప్రభుత్వం డ్రై డేగా ప్రకటించిందని చెప్పారు. ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నీలం వెంకట రామకృష్ణ, సిహెచ్ఓ శృతి, ఆశా కార్యకర్త రత్నకుమారి పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని యనమదల పంచాయతీలో ఇంటింటికీ వెళ్ల ఫివర్ సర్వే, శానిటేషన్‌ను ఎంపిడిఒ ఒ జావేద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జ్వర పీడితుల ఇళ్ళకు వెళ్ళి అడిగి జ్వర పరీక్షలు చేయించారు. నీటి గుంటల్లో దోమల నివారణ మందు చల్లించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ పిటివి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాణి, ఆషా కార్యకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.

ఇంకొల్లు : స్థానిక ప్రభుత్వ వైద్యశాల పరిధిలోని గ్రామాల్లో డాక్టర్ అంజలి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గంబుషియా చేప పిల్లలను వదిలారు. డెంగ్యూ జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రభలకుండా దోమల నివారణకు కలెక్టర్ వెంకట మురళీకృష్ణ, డిఎంహెచ్ఓ ఆదేశాల మేరకు గంబూషియా చేప పిల్లలను నీటి కుంటల్లో వదిలినట్లు తెలిపారు. ఇంకొల్లుతోపాటు వంకాయలపాడు, పూసపాడు, ఇడుపుల పాడు గ్రామాల్లో చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు.

పేదలకు అండగా సేవలందించాలి

ప్రజాశక్తి - కర్లపాలెం

విపత్కర పరిస్థితుల్లో కాలవకట్టలపై, ఉండడానికి సరైన నివాసాలు లేని గిరిజన కుటుంబాలకు ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆహార పొట్లాలు అందించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎంపిడిఒ ఐనంపూడి శ్రీనివాసరావు మాట్లాడారు. లంక కాల్వ కట్టపై నివసిస్తున్న గిరిజనులకు ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీత, ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షులు బండ్రెడ్డి గోపి, కార్యదర్శి బత్తుల సురేష్, కోశాధికారి జోగి సువర్ణరాజు, విన్నకోట శ్రీనివాసరావు, మద్దిబోయిన గోపి, బండి శ్రీనివాసరావు, యలవల శ్రీనివాసరావు, తన్నీరు గోపి, నందిపాటి శ్రీరామ్ సునీల్, బండ్రెడ్డి అంకమ్మరావు, కె రవి, కృష్ణారెడ్డి, భీమా కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పొలాలు పరిశీలిస్తున్న ఎఒ బ్రహ్మారెడ్డి

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వరద ముప్పు పొంచి ఉందన్న సమాచారం నేపధ్యంలో వ్యవసాయ అధికారులు అప్రమత్తం అయ్యారు. మండలంలోని పెదపులివర్రు, చింతమోటు గ్రామాల మధ్య చిన్న రేవుపై ఉన్న చప్టాను ఎఒ బ్రహ్మారెడ్డి పరిశీలించారు. ఈపాటికే చప్టాలపైకి నీరు బాగా రావటంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. ప్రస్తుతానికి పంటలు వరదలకు ఏమీ ప్రభావితం కాలేదని అన్నారు. ముంపు ప్రభావిత గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పొలాల నుండి నీటిని బయటకు పోయే విధంగా గండులు చేసుకోవాలని సూచించారు. ఎఇఒ కె లక్ష్మీ ప్రసన్న, వి బుష్, టి అఖిల, గోపిరాజు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

- వరి రైతుకు వర్షంతో దెబ్బ మీద దెబ్బ
- ప్రభుత్వం ఆదుకోకపోతే కష్టమే



చెరువులుగా మారిన వరి పొలాలు

ప్రజాశక్తి - బాపట్ల

వరి ఎదపెట్టిన వ్యవసాయ పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో ఒకటికి రెండుసార్లు వరి ఎదపెట్టారు. ఈ వర్షంతో పంట దెబ్బతినింది. ఈ ఖరీఫ్ సీజన్ వ్యవసాయం దెబ్బ మీద దెబ్బ పడుతోంది. నెల రోజుల క్రితం ఎదపెట్టిన వరి పొలాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మునిగిపోవడంతో మళ్ళీ వరి ఎదపెట్టారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు చెరువులుగా మారాయి. దీంతో రెండోసారి ఎద పెట్టిన రైతుకు ఎకరాకు రూ.10వేల నష్టం వాటిల్లింది. తిరిగి మళ్లీ వరి విత్తనం, దుక్కి, ఇతర ఖర్చులు కలిపి ఎకరానికి మరో రూ.5వేలు ఖర్చు అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఈ ఏడాది తొలి విడతలోనే రూ.15వేలు ఎకరాకు వరి ఎద పెట్టేందుకు రైతు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ప్రధానంగా పొలాల్లో నిలిచిన వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేదు. మురుగు నీటి కాలువల వ్యవస్థ అంతంత మాత్రమేగానే ఉంది. మురుగు కాలువలో తూటికాడ పేరుకుపోయింది. గతంలో మరమ్మత్తులు నిర్వహించిన మురుగు కాలువలు సైతం వర్షాల దెబ్బకు తవ్విన మట్టి తిరిగి జారిపడి యధాస్థితికి చేరాయి. దీంతో పొలాల్లో ఎక్కడ నీరు అక్కడే ఎగదన్ని ఎదపెట్టిన వరిపైరు పూర్తిగా మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. మండలంలో మూలపాలెం, పట్టణ శివారు ఉప్పరపాలెం, జమ్ములపాలెం, కంకటపాలెం, నర్సాయపాలెం, అప్పికట్ల, ఈతేరు, గుడిపూడి ప్రాంతాల్లో మగాణి పొలాల్లో అధిక శాతం రైతులు వరి ఎద పెట్టారు. నారు పెంచి నాటు వేయాలంటే కూలి ఖర్చులు భరించే కంటే ఎదపెడితేనే కొంత ఖర్చు తగ్గించుకోగలమని రైతులు ఎదపెట్టేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ ఏడు రెండు సార్లు వర్షం దెబ్బ తగలడంతో మూడోసారి ఎద పెట్టేందుకు అనుకూలంగా ఉంటాయా లేక నాట్లు వేయాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. తిరిగి నాట్లు వేయాలంటే ఖర్చు తడిసిమోపడవుతుంది. వర్షాల దెబ్బకు వరినారు రేట్లు పెరిగిపోయాయి. మొన్నటి వరకు సెంటు వరి నారు రూ.1500 నుండి రూ.1600 వరకు ఉంది. వర్షాలకు వరి పొలాలు దెబ్బ తినడంతో సెంటు నారు రూ.2వేల నుండి రూ.2500 వరకు ధర పలికే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. నారు తెచ్చి కూలీలతో నాట్లు వేయించేందుకు దుక్కి దున్నే ఖర్చులన్నీ చూస్తే మళ్లీ రూ.10 నుండి రూ.15వేల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోందని రైతులు తెలిపారు. వేల ఎకరాల్లో దెబ్బతిన్న వరి మండలంలో 5800 ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇంత విస్తీర్ణంలో ఇప్పుడు నాట్లు వేయాలంటే ఎకరాకు రూ10వేల చొప్పున మండలంలో రైతులపై అధిక భారం పడుతుందని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోకపోతే కష్టమే



సింహాద్రి వెంకటేశ్వర్లు, ఉప్పరపాలెం

ఇప్పటికి రెండుసార్లుగా వరి ఎదపెట్టేందుకు ఎకరాకు రూ.10వేలు నష్టపోయామని ఉప్పర పాలెం వరి రైతు సింహాద్రి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ వరి ఎదపెట్టే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం కావడం లేదని అన్నారు. నాటు వేయాలంటే నారు ధరలు పెరిగిపోయాయని అన్నారు. సెంటు నారు రూ.2500 నుండి రూ.3వేల వరకు పలుకుతుందని అన్నారు. రవాణా ఖర్చులు, నాటు కూలి కలుపుకుంటే రూ.10వేలకు పైనే ఎకరాకు ఖర్చు పెట్టాల్సి వస్తుందని అన్నారు. ఇన్ని ఖర్చులు పెడితే పంట చేతికి వచ్చే సమయానికి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనం ఎదపెట్టే సమయంలో ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులకైనా ప్రాథమిక దశలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తే కొంతమేర కోలుకుంటారని అనినారు. లేకపోతే అప్పులపాలవుతారని అన్నారు.

నెలలో రెండు సార్లు దెబ్బ తిన్నాం



కేశన సాంబయ్య, వరి రైతు, బాపట్ల

మూడు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నట్లు బాపట్లకు చెందిన వరిరైతు కేశన సాంబయ్య చెప్పారు. ఇప్పటికి నెలలో రెండు సార్లు వర్షం దెబ్బకు ఎదపెట్టిన వరి పూర్తిగా దెబ్బతినిందని అన్నారు. మూడు ఎకరాలకు రూ.30వేలు ఖర్చయినట్లు చెప్పారు. అదంతా వర్షం పాలైందని అన్నారు. తిరిగి నాట్లు వేయాలంటే మళ్లీ ఇంత ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న వరి పైరుకు ప్రాథమిక అంచనాలు వేసి ఉచితంగా వరి విత్తనాలు, సబ్సిడీపై ఎరువులు, దుక్కి ఖర్చులకు నగదు అందజేసి ఆదుకోకపోతే ఈ ఏడు వ్యవసాయానికి రైతులు అప్పులు పాలు కాక తప్పదని అన్నారు. మురుగు కాలువలు బాగు చేయలేదని తెలిపారు. దీంతో పొలాల్లో చేరిన వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేదని అన్నారు. మురుగు కాల్వల్లో గుర్రపు డెక్క పేరుకుపోయిందని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన కాలువలు మరమత్తు చేయించాలని కోరారు.

చిన్నరేవు చప్టాపై వరద ఉధృతి

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రకాశం బ్యారేజీ నుండి 6లక్షల క్యూసెక్కులు నీరు వదలడంతో లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి అన్నారు. మండలంలోని దోనేపూడి దగ్గర చిన్న రేవులో ప్రవహిస్తున్న వరద నీటిని ఆమె పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, తోకలవానిపాలెం సర్పంచ్ టి కృష్ణమోహన్ ఉన్నారు.

భట్టిప్రోలు : కృష్ణా నదికి విడుదలవుతున్న వరదనీటి కారణంగా లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేపల్లె డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు సూచించారు. నదిలో ప్రవహిస్తున్న వరదనీటిని ఓలేరు, పల్లెపాలెం, పెద్ద పులివర్రు గ్రామాల్లోని చిన్న రేవు చప్టాలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ ఎం శివయ్య ఉన్నారు.



గ్రామంలో ఆందోళన చేస్తున్న టిడిపి కార్యకర్తలు

టిడిపిలో భగ్గుమన్న విభేదాలు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం తెలుగుదేశంలో రెండు వర్గాలు మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఒక వర్గానికి చెందిన వాళ్లకు అంగనవాడి కార్యకర్త పోస్టు మంత్రి పిఏ సిఫార్సు చేయడంతో మరో వర్గం తామే నిజమైన టిడిపి కార్యకర్తలమని, తమకు అన్యాయం జరిగిందని నిరసనకు దిగారు. గ్రామంలోని మెయిన్ రోడ్డులో టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాలు చించివేసి నిరసన తెలిపారు. పార్టీ పుట్టుక నుండి తెలుగుదేశంలో పనిచేసిన కార్యకర్తలకు అన్యాయమే జరుగుతుందని టిడిపి నాయకులు పరిటాల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కార్యకర్తలు రోడ్డుపై బైఠాయిం చారు. ఇప్పటికైనా అధిష్టానం నిజమైన కార్యకర్తలను గుర్తించాల్సిన అవసరం ఉందని టిడిపి గ్రామ నాయకులు కోరారు.

రైతులకు అండగా ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి - వేమూరు

తమ ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాది పాలనలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందించి రైతులకు అండగా నిలిచిందని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ క్రింద రైతులకు ఏడాదికి రూ.20వేలు అందజేయడంలో భాగంగా మొదటి విడత రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతులు ట్రాక్టర్లు, బైకులతో విజయోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గుత్తిపాటి జయ వెంకట పూర్ణ కుమారి, భాను గంగాధర్, జొన్నలగడ్డ విజయబాబు, తునుగుంట్ల సాయి బాబా, మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదన్ ప్రసాద్, వాకా శేషుబాబు పాల్గొన్నారు.



ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు : ప్రభుత్వం సూపర్ సిక్స్ సూపర్ హిట్ రైతు సంబర సభకు మండలం నుంచి తెలుగుదేశం అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో రైతులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు ట్రాక్టర్లు, బైకులతో ర్యాలీగా వేమూరు రైతు సంబర సభకు వెళ్లారు.

కదలని నల్లబర్లీ పొగాకు మండెలు

ప్రజాశక్తి - పంగులూరు



తలపనేని రామారావు

నల్లబర్లీ పొగాకు మండెలు కట్టి ఇప్పటికి ఆరు నెలలైంది. పొగాకు నాణ్యత లోపించింది. మార్క్‌ఫెడ్ అధికారులు కూడా నాణ్యత ప్రమాణాలను బట్టి క్వింటా పొగాకు రూ.9వేలు, రూ.6 వేలకు మించి కొనుగోలు చేయటం లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు తెలిపారు. 30శాతం బేళ్లు రిజెక్ట్ చేస్తున్నారని అన్నారు. రైతులు ఎకరాకు రూ.40 వేల నుండి రూ.60 వేలు నష్టపోతున్నారని అన్నారు. గ్రామాల్లో కొంత మంది రైతుల పేర్లు రాక, మండెలు అట్లానే ఉన్నాయని అన్నారు. మార్క్‌ఫెడ్ స్టాక్ గోడౌన్లు లేవని ఈ వారం కొనుగోళ్లు నిలిపివేశారని అన్నారు. మొదట ప్రారంభించిన కేంద్రాల్లోనే కొనుగోలు జరపాలని, అక్కడ నుండి మార్క్‌ఫెడ్ వేరే ప్రాంతాలకు డంపింగ్ చేసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ఇప్పటికే నష్టపోయి ఉన్నారని, దూర ప్రాంతాలకు బేళ్లు తీసుకురమ్మటం భావ్యం కాదని అన్నారు. రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరించాలని కోరారు. వర్షాకాలం వచ్చిందని, కొనుగోలు సక్రమంగా జరిగేటట్లు చూడాలని కోరారు. రైతుకు 40 చెక్కులకు పర్మిషన్ వచ్చిన 20 చెక్కులు మాత్రమే తెచ్చుకోమని అంటున్నారని తెలిపారు. రైతుకు ఇచ్చిన పర్మిషన్ ప్రకారం కొనుగోలు చేయాలని అన్నారు. రిజెక్ట్ లేకుండా కొనుగోలు జరపాలని డిమాండ్ చేశారు. కొనుగోలు ప్రారంభించి 60 రోజులైన ఇంతవరకు రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాలేదని అన్నారు. కొనిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పారని గుర్తు చేశారు. అధికారులు ఇప్పటికైనా రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయాలని కోరారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

17న జెవివి జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - బాపట్ల

జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు ఈ నెల 17న నిర్వహించనున్నట్లు జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై భాస్కరరావు, తంగా శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో గురువారం జరిగిన సన్నాహక సమావేశంలో జెవివి గోడ ప్రతులను డాక్టర్ చల్లా మోహనరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కంరావు మాట్లాడుతూ పట్టణంలోని మునిసిపల్ హై స్కూలులో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, రాజేష్, కళాధర్, యుటిఎఫ్ జిల్లా బాధ్యులు జడ వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, తటవర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

సిఎంకు మంత్రి స్వామి ధన్యవాదాలు

ప్రజాశక్తి-టంగుటూరు

వెలిగొండ తూర్పు ప్రధాన కాలువ నుంచి పాలేరు, ముసికి నీటి కేటాయింపులు చేసినందుకు గాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మల రామనాయుడు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వెలిగొండ తూర్పు ప్రధాన కాలువ నుంచి పాలేరు, ముసికి నీరు కేటాయించడం వల్ల కనిగిరి పరిసర గ్రామాలతో పాటు పొన్నలూరు, మర్రిపూడి, జరుగుమల్లి, సింగరాయకొండ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పాలేరుపై ఉన్న సంగమేశ్వర ప్రాజెక్ట్, ఈవీ చానల్‌కు కూడా ఉపయోగకరమన్నారు.

సీఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని ముల్పూరు గ్రామానికి చెందిన గోరికపూడి రంగమ్మ, తురుమెళ్ల గ్రామానికి చెందిన పడమటి సామ్రాజ్యం అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి వైద్యానికి అవసరమైన ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి నుండి రంగమ్మకు రు.3 లక్షలు, సామ్రాజ్యంకు రు.2లక్షల చొప్పున మంజూరయ్యాయి. ఈనగదు చెక్కులను శాసన సభ్యులు నక్కా ఆనందబాబు తన క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - అద్దంకి

రెండేళ్ల క్రితం రెండు స్కూటీలు, ఒక ద్విచక్ర వాహనం దొంగిలించిన కేసు నమోదు కాగా ఎస్ఐ పివి నరసింహులు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో దొంగిలించిన వాహనాలు గుర్తించి దొంగతనం చేసిన వ్యక్తులు కుంచాల ఎస్ కుమార్, ముప్పాల శివయ్యను అదుపులోకి తీసుకున్నారు. ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో సిఐ సుబ్బరాజు పాల్గొన్నారు.

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి - బాపట్ల

ఎడతెరిపి లేని వర్షాలతో పల్లపు ప్రాంతాల నివాస గ్రహాల్లోకి వర్షపు నీరు చేరింది. పట్టణంలోని 7వ వార్డు శారదాపురి కాలనీ, శాంతినగర్ ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి ఇబ్బంది పడుతున్నారు. వర్షపు నీటిని తొలగించుకునే పనిలో ఉన్నారు. పట్టణ శివారుల్లో మరింత లోతట్టు ప్రాంతాలైన 3, 4, 5, 7 వార్డులతో పాటు ప్యాడిసన్ పేట, మూలపాలెం జగనన్న కాలనీలు జలమయం అయ్యాయి. కాలనీలోని వర్షపు నీరు బయటకు పారుదల లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ వర్షం కురిస్తే పరిస్థితి తీవ్ర రూపంలో వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు అధికారులు తమను ఆదుకోవాలని కోరారు.


ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
నిజాలను నిర్భయంగా ప్రచురిస్తూ ఉద్యోగ కార్మిక,
కర్షకుల అభ్యున్నతికి అక్షర పోరాటం చేస్తున్న
ప్రజాశక్తి దినపత్రిక యాజమాన్యంకు,
జర్నలిస్టు మిత్రులకు 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలతో...
ప్రజాశక్తి 45 వ వార్షికోత్సవం 1981 - 2025
సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం
యర్రగొండపాలెం


ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ మరియు
స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు
ప్రజాశక్తి 45 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు 1981-2025
స్వాతంత్రోద్యమంలో భాగంగా...
అక్షర సమరం ఆరంభించి, అక్షరం అక్షరం అభ్యుదయంతో
ముందుకుసాగి నేడు ప్రతి అక్షరం ప్రజల పక్షమై
ప్రజల దైనందిక జీవితంలో భాగమైన ప్రజాశక్తి బృందానికి,
పాఠక లోకానికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ...
ప్రజాశక్తి అభిమాని
ఒ.ఎస్.ఆర్


స్వాతంత్ర్య దినోత్సవ...
మరియు
ప్రజాశక్తి వార్షికోత్సవ
శుభాకాంక్షలతో...
45 ప్రజాశక్తి
వందే మాతరం...
భారతీయతే మా నినాదం...
స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
ఆగస్టు-15-2025
'ప్రతి అక్షరం-ప్రజల పక్షం' నినాదంతో
'ప్రజాశక్తి తెలుగు దినపత్రిక' దినదినాభివృద్ధి చెందుతూ,
ప్రజల ఆదరాభిమానాలతో 45వ వార్షికోత్సవ వేడుకలు
జరుపుకుంటున్న వేళ... శుభాకాంక్షలు...
శ్రీ అరవింద సమగ్ర విద్యా కేంద్రం
మార్కాపురం


ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు..
ప్రజాశక్తి 45 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు 1981-2025
ఎస్.జాన్ సుందరం
ఎంపిడిఒ
కార్మికులు, కర్షకులు, రైతులు, ఉద్యోగుల సమస్యలే ప్రధాన
ఎజెండాగా వార్తలు ప్రచురిస్తున్న ప్రజాశక్తి దినపత్రిక
45 వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా..
పత్రిక అన్ని విభాగాలలో పనిచేస్తున్న సిబ్బందికి
నా హృదయపూర్వక శుభాకాంక్షలు..
Y.సుజాత,
ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, పెద్దారవీడు
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం
టెక్నికల్ అసిస్టెంట్ & క్షేత్రసహాయకులు


Regd:322/2021
79
15 AUGUST
ముస్లిం యూత్ సొసైటీ
ISM ఫౌండేషన్ వారి
79 వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
ప్రజల శ్రేయస్సే ప్రధాన లక్ష్యం కులమతాలకు అతీతంగా చేయి చేయి కలుపుదాం
సమాజానికి సేవ చేద్దాం ...! రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి ...!
DONATE BLOOD
SAVE A LIFE
డా॥ షేక్.ఇస్మాయిల్
ముస్లిం యూత్ సొసైటీ
ఫౌండర్ & అధ్యక్షులు
8897919969
INDEPENDENCE DAY
Celebration